


హైదరాబాద్‌లోని గన్‌పార్కు వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

## అమరవీరులకు బీఆర్ఎస్ శ్రేణుల నివాళి

### హైదరాబాద్‌లోని గన్‌పార్కు వద్ద కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి

జనగామ, జూన్ 1 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లోని గన్‌పార్కు వద్ద జనగామ నాయకులు అమరులకు ఘన నివాళులు అర్పించారు. రాష్ట్ర సాధనలో అమరుల త్యాగం అజరామరమైనదని, ఉద్యమానికి, ఉద్యమ నేత కేసీఆర్‌కు స్ఫూర్తిగా నిలిచారని బీఆర్ఎస్ పట్టణ నాయకులు దళితరత్న తిప్పారపు విజయ్‌కుమార్, పట్టణ యూత్ అధ్యక్షుడు ఉల్లెంగుల సందీప్ అన్నారు. స్వరాష్ట్రంలో సగర్వంగా జీవిస్తున్నామంటే అందుకు అమరవీరుల త్యాగాలే కారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు చెన్నూరి నవీన్, కన్నారపు వంశీ పాల్గొన్నారు.

### చిల్పూరు మండల నాయకుల నివాళి..

చిల్పూరు : తెలంగాణ రాష్ట్ర సాధనకు పోరాడి అమరులైన వీరులకు బీఆర్ఎస్ నాయకులు నివాళులర్పించారు. శనివారం హైదరాబాద్‌లోని గన్‌పార్కు వరకు కొవ్వొత్తులతో నిర్వహించిన ర్యాలీలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి చిల్పూరు మండల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కేశిరెడ్డి రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ అమరవీరుల ఆశయ సాధనే బీఆర్ఎస్ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ మండల అధ్యక్షుడు నారగోని రవిచంద్ర, నాయకులు బత్తుల రాజన్‌బాబు, శాగ వెంకటేశ్వర్లు, తాళ్లపల్లి కాంత్రికుమార్, ఎడ్ల రాజేశ్, గడ్డమీది మహేందర్, సాయిరెడ్డి పాల్గొన్నారు.



పోచన్నపేటలో విచారణ జరుపుతున్న జనగామ డీసీపీ సీతారాం

## భూవివాదంపై డీసీపీ సీతారాం విచారణ

బచ్చన్నపేట, జూన్ 1 : మండలంలోని పోచన్నపేటలో నెలకొన్న భూ వివాదంపై శనివారం జనగామ డీసీపీ సీతారాం విచారణ చేపట్టారు. సర్వే నంబర్ 422, 423లో దళితులకు సంబంధించి వారసత్వపు భూ వివాదంపై ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామానికి చెందిన శ్రీపతి లక్ష్మీమల్లయ్య పిర్యాదు మేరకు వారితో మాట్లాడారు. చుట్టుపక్కల రైతులను పిలిపించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ రెండు మూడు రోజుల్లో సమస్య పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. ఘర్షణలకు తావివ్వకుండా సహకరించాలని ఆయన కోరారు. ఎస్సై కంకల సతీశ్, పోలీసులు జమాలొద్దీన్, అనిల్‌కుమార్, రైతులు ప్రభాకర్, నారాయణ, నర్సింహులు, మల్లయ్య, సౌందర్య, యాదయ్య, వెంకటయ్య, రేణుక, రమేశ్, సుధాకర్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడిగా కీమానాయక్



కీమానాయక్

జఫర్‌గఢ్, జూన్ 1 : కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడిగా భూక్యా కీమానాయక్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు నునావత్ సుమన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రేగడితండా శివారు కేజీ తండాకు చెందిన కీమానాయక్ కాంగ్రెస్ బలోపేతానికి చేసిన కృషికి గుర్తింపుగా మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా నియమించామన్నారు. కీమానాయక్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇందిరకు కృతజ్ఞతలు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-327724

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-318953

WANTED FEMALE TELECALLERS

★Urgent Requirement for ICICI, HDFC Bank Personal Loans Fresher Female Tele-Callers, Vacancies: 40, Sal+Inc. etc.., Job Location: HNK, Cont: 8886188690.
NTW-5697

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

HEALTH CARE

★ఆత్మీయ రిహాబ్ సెంటర్ యందు వృద్ధులకు మరియు పక్షవాతం, సర్జరీ తరువాత రికవరీ కోసం క్యాన్సర్ పేషంట్స్ కొరకు అవసరమగు 24 గం||ల సేవలు అందించబడును. సంప్ర|| 6281476205, 9440325526
KMM_11654

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556 9182777557
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565

# నేడు రాష్ట్ర అవతరణ దినోత్సవం

- జిల్లా కేంద్రంలో జాతీయ జెండాను ఆవిష్కరించనున్న కలెక్టర్
- కలెక్టరేట్‌లో ఏర్పాట్లపై అధికారులతో షేక్ రిజ్వాన్ బాషా సమీక్ష



జనగామలో రాష్ట్ర అవతరణ వేడుకలకు ముస్తాబైన కలెక్టరేట్ ప్రాంగణం

జనగామ, జూన్ 1 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకకు జిల్లా సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సూర్యాపేట రోడ్డులోని సమీకృత కలెక్టరేట్ ఆవరణలో వైభవంగా వేడుకలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లపై శనివారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్షించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉదయం 9 గంటల లోపు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ




ఏర్పాట్లను పరిశీలిస్తున్న షేక్ రిజ్వాన్ బాషా

జెండాలను ఆవిష్కరించాలని సూచించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని పేర్కొన్నారు. ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం తగదని, గ్రామ పంచాయతీల్లో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు జాతీయ జెండాను ఎగురవేయాలని ఆయన కోరారు. సమీకృత కలెక్టరేట్‌లో ఉదయం 9 గంటలకు జాతీయ పతాక ఆవిష్కరణ ఉంటుందని తెలిపారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్ ఆవరణలో చేయాల్సిన ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్, ఏసీపీ అంకిత్ కుమార్ శంఖ్వార్‌తో కలిసి షేక్‌రిజ్వాన్ బాషా ఏర్పాట్లు పరిశీలించారు. వేడుకలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. కుర్చీల ఏర్పాటుతో పాటు నీడ కోసం టెంట్లు, స్టేజ్, అలంకరణ, అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తాగునీరు కల్పించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషా మాట్లాడుతూ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని హైదరాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్స్‌లో అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారుల సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. దీనికి జిల్లా నుంచి 16 మంది అమరవీరుల కుటుంబాలను ఐదు వాహనాల్లో తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. 102 మంది ఉద్యమకారులు వారి కుటుంబాలతో రెండు ఏసీ బస్సుల్లో ఆదివారం ఉదయం 6 గంటలకు బయలుదేరుతాయని తెలిపారు. జిల్లాలోని అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారులు అవతరణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో పాల్గొనేలా ఆహ్వానించాలని, ఆశవర్కర్లు, ఏపీఎంలు, డీపీఎంలు, ఆరోగ్య సహాయకులు, అధికారులను నియమించి వారితో పంపాలని సూచించారు. తాగునీరు, ఫుడ్, తదితర అన్ని ఏర్పాట్లతో జాగ్రత్తగా వారిని తీసుకెళ్లి తిరిగి వారి ఇళ్లకు చేర్చాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో అనిల్‌కుమార్, డీఈవో రాము, డీఏఓ వినోద్ కుమార్, డీసీఎస్‌వో రోజా రాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## చరిత్ర ఆనవాళ్లు తొలగిస్తే ఉద్యమిస్తాం

- మాజీ ఎమ్మెల్యే టీ రాజయ్య
- సీఎం రేవంత్‌రెడ్డి విధానాలపై బీఆర్ఎస్ శ్రేణులతో నిరసన

లింగాలఘనపురం, జూన్ 1 : కవులు, కళాకారులు, మేధావులు శ్రమించి రూపొందించిన తెలంగాణ సర్కారు రాజముద్రను తొలగిస్తే ఊరుకోమని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య స్పష్టం చేశారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి పాలన అస్తవ్యస్తంగా ఉందని, పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని ఎద్దేవా చేశారు. శనివారం ఆయన మండలంలోని కళ్లెంకు వచ్చిన సందర్భంగా రాజయ్య విలేకరులతో మాట్లాడారు. గత సంవత్సరం కేసీఆర్ నేతృత్వంలో 21 రోజులు ఘనంగా దశాబ్ది ఉత్సవాలను నిర్వహించామని గుర్తు చేశారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని సమీక్షిస్తూ, భవిష్యత్‌లో చేపట్టాల్సిన పనులపై చర్చించామన్నారు. నాడు పల్లెనిద్ర, రచ్చబండ కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. కులాలు, మతాలకు అతీతంగా



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

ప్లేగు వ్యాధికి గుర్తుగా పూర్వం హైదరాబాద్‌లో చార్మినార్‌ను నిర్మించారని రాజయ్య వివరించారు. ఓ వైపు మక్కా మసీదు, మరో వైపు భాగ్యలక్ష్మి దేవాలయాన్ని నిర్మించి మతసామరస్యాన్ని చాటారని తెలిపారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే 400 ఏళ్ల చార్మినార్ ఉత్సవాలను జరిపిందన్నారు. కార్యదక్షతకు, ధీరత్వానికి కాకతీయ కళాతోరణం చిహ్నమన్నారు. దీనిని తొలగించాలని నిర్ణయించడం సీఎం రేవంత్‌రెడ్డి పిచ్చి చేష్టలకు నిదర్శనమన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన కులాన్ని రుజువు చేసేకోవాలని సవాల్ విసిరారు. నాడు సీఎం రేవంత్‌రెడ్డే అఖిలపక్షంతో కడియం కులాన్ని నిరూపించుకోవాలని సూచించారని గుర్తు చేశారు. అధికార దాహంతో కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరికి ప్రజలు గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండ చంద్రమౌళి, మబ్బు కరుణాకర్, ఉడుగుల భాగ్యలక్ష్మి, గట్టగల్ల శ్రీహరి, బస్వగాని శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



చిల్పూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

## వైభవంగా వెంకన్న వార కల్యాణం

చిల్పూరు, జూన్ 1 : మండల కేంద్రంలోని బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారి వార కల్యాణం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు ఉత్సవమూర్తులను అలంకరించి వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని కన్నులపండువగా కొనసాగించారు. మరోవైపు ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. దాతలు గుగులోత్ దేవ్ సింగ్–లక్ష్మీ రూ.10 వేలు, పొట్లపల్లి శ్రీధర్‌రావు–కిరణ్మయి రూ.5 వేలు, వేణుముద్దుల విష్ణువర్ధన్ రెడ్డి–నిర్మల రూ.5 వేలు, గొల్లపల్లి శ్రీనివాస్ రూ.3 వేలు, బబ్బుల వంశీ రూ.వెయ్యి విరాళంగా అందించారు. సంగోజు మోహనాచారి–శంకరలక్ష్మీ పూజ సామగ్రి అందించారని అర్చకులు తెలిపారు. రఘునాథపల్లికి చెందిన అల్లిబిల్లి వెంకటస్వామి–స్వప్న, వినయ్‌కుమార్, రవళి దంపతులు భక్తులకు అన్నదానం చేశారని ఆలయ ఈవో లక్ష్మీప్రసన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు బ్రాహ్మణపల్లి రవీందర్‌శర్మ, సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ ఆడెపు రమేశ్, అసిస్టెంట్ వీరన్న,



పూజలు చేస్తున్న జడ్జి రవీందర్‌శర్మ దంపతులు

సిబ్బంది కృష్ణ, మల్లికార్జున్, గాదె రాజశేఖర్, మహేశ్, విశాల్, అజయ్, లక్ష్మి పాల్గొన్నారు.

**బుగులు వెంకన్నకు జిల్లా జడ్జి పూజలు**

కేంద్రంలోని బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని శనివారం జిల్లా కోర్టు ప్రిన్సిపల్ జడ్జి డీ రవీందర్‌శర్మ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం స్వామివారికి ఆయన పూజలు చేశారు. అనంతరం రవీందర్‌శర్మకు ఆలయ అర్చకులు రవీందర్‌శర్మకు స్వామివారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై జయకుమార్ పాల్గొన్నారు.

## పాము కాటుతో మహిళ మృతి



దండవ్వ(ఫైల్)

నర్మెట, జూన్ 1: పాము కాటుకు గురై మహిళ దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని హన్మంతాపూర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హన్మంతాపూర్‌కు చెందిన మ్యాక దండవ్వ(55) శనివారం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి ఆవుల కోసం మేత కోస్తున్నది. ఈ క్రమంలో ఆమె కుడి చేతిపై పాము కాటు వేయడంతో స్థానికులు జనగామలోని జిల్లా ఆసుపత్రికి తరలించారు. దవాఖానలో చికిత్స పొందుతూ దండవ్వ మృతిచెందింది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ యాదవ్ తెలిపారు.

## 28న డాక్ అదాలత్

హనుమకొండ, జూన్ 1 : ఈ నెల 28న పోస్ట్ మాస్టర్ జనరల్ తెలంగాణ సర్కిల్ హైదరాబాద్‌లో 46వ డాక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు హనుమకొండ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ డివిజన్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, ములుగు, భూపాలపల్లి, జనగామ జిల్లాల ప్రజలు పోస్టల్ శాఖకు సంబంధించిన ఫిర్యాదులను ఈ నెల 14వ తేదీలోగా పోస్టల్ కవర్‌లో కే శ్రీకాంత్, అసిస్టెంట్ డైరెక్టర్, పోస్ట్‌మాస్టర్ జనరల్, హైదరాబాద్–500001 పంపించాలన్నారు. పోస్టల్ కవర్‌పై తప్పకుండా 46వ డాక్ అదాలత్ అని రాయాలని పోస్టల్ హనుమంతు పేర్కొన్నారు.



గుండ్లగడ్డ ఉమామహేశ్వర్ ఆలయంలోని హనుమంతుడు



జఫర్‌గఢ్‌లో పూజలు చేస్తున్న హనుమాన్ భక్తులు



కొన్నెలో అన్నదానం చేస్తున్న భక్తులు

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

- ఆలయాల్లో పూజలు
- పలుచోట్ల ఉత్సవ కమిటీల అన్నదానం

జనగామ, జూన్ 01 (నమస్తే తెలంగాణ) : హనుమాన్ జయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని బాణాపురం ఆంజనేయస్వామి, బాణాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాలతోపాటు పట్టణంలోని అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. హనుమాన్ మాల ధరించి దీక్ష విరమించేందుకు వెళ్తున్న భక్తులు ఇరుముడి కట్టుకొని కొండగట్టుకు పయనమయ్యారు. గుండ్లగడ్డ ఉమామహేశ్వర ఆలయంలో పూజారి రాజేష్ భార్గవ్ ఆధ్వర్యంలో మల్లెపూలు, తమలపాకులు, ఎర్రగన్నేరు, కనకాంబరాలు, చామంతిలు, సింధూరంతో అభిషేకం చేశారు. మహిళా భక్తులు 121 సార్లు జై సీతారామ అని రాసి హనుమంతుడికి మాలగా వేశారు.

**పాలకుర్తిలో..**

పాలకుర్తి : హనుమాన్ జయంతిని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలోని స్వయంభు సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి క్షీరగిరి క్షేత్రంలో కొలువుదీరిన భక్త ఆంజనేయస్వామి ఆలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్షేత్రపాలకుడు ఆంజనేయ స్వామికి



పాలకుర్తిలోని ఆలయంలో అర్చకుల పూజలు

విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం చేశారు. మూల విరాట్‌కి పంచామృత చందనాభిషేకంతో భక్తులు మొక్కులు చెల్లించారు. అర్చకులు స్వామివారి విగ్రహానికి పుష్పాలు, తమలపాకులు, వడమాలతో అష్టోత్తర అర్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోమేశ్వరాలయ ఈవో భాగం లక్ష్మీప్రసన్న, అర్చకులు డీవీఆర్ శర్మ, దేవగిరి అనిల్‌కుమార్, మత్తగజం నాగరాజు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**జఫర్‌గఢ్‌లో..**

జఫర్‌గఢ్ : మండలంలో హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని బైరాగి ఆంజనేయులు ఆలయం, వడ్డెగూడెం, సాగరం, తిడుగు, కోనాయిచలం, కూనూరు, తిమ్మంపేట, షాపల్లి గ్రామాల్లోని ఆలయాల్లో హనుమంతుడి విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించారు. జఫర్‌గఢ్‌లో నిర్వహించిన కార్యక్రమాల్లో పురోహితులు ఎల్లంబట్ల శశిధర శర్మ పాల్గొన్నారు.

**బచ్చన్నపేటలో..**

బచ్చన్నపేట : మండల కేంద్రంలోని శివభక్తమార్కేండేయ స్వామి ఆలయంలో పూజారి గణపురం ఆనంద్ నేతృత్వంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కొన్నెలో బీఆర్ఎస్ నేత కోడూరి శివకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. శంకరయ్య, లక్ష్మణ్, సత్యనారాయణ, సంపత్, బాలస్వామి, శ్రీకాంత్, సుమన్, భాస్కర్, సు ధాకర్, మహేందర్, రాకేశ్, నాగరాజు, వంశీ, భద్రయ్య పాల్గొన్నారు.



పాలకుర్తి సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

## మరమ్మతుల పేర కరెంట్ కోతలు..

- గ్రామాల్లో అమలుకు నోచని నిరంతర విద్యుత్
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

పాలకుర్తి రూరల్, జూన్ 1: అసలే ఎండకాలం.. పైగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ఉక్కపోతలు.. మరోవైపు సబ్‌స్టేషన్లు, లైన్లలో మరమ్మతుల పేరుతో నిత్యం కరెంట్ కోతలు.. ఫలితంగా గ్రామాల్లో రైతులు, అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గాలి దుమారంతో వర్షం కురిస్తే కరంట్ కట్ అవుతున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చాక విద్యుత్ కోతలు పెరిగాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 24 గంటల కరెంట్ దేవుడెరుగు, కానీ ప్రతి రెండు గంటలకోసారి కరెంట్ కట్ చేస్తున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేదు. గ్రామాల్లో కరెంట్ కోతలపై విద్యుత్ అధికారులకు ఫోన్ చేస్తే సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నామని చెబుతున్నారని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మధ్య రాత్రి కూడా మరమ్మతులు చేస్తున్నారంటే ప్రభుత్వం విధానం ఏంటో అర్థం కావడంలేదని మండిపడుతున్నారు. పాలకుర్తి మండలంలో 36 గ్రామ పంచాయతీలు ఉండగా విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్ఎస్ పాలనలో 24 గంటలు కరెంట్ ఉండేది. గత వారం రోజులుగా దర్దేపల్లిలో విద్యుత్ సమస్యతో ప్రజలు అల్లాడుతున్నారు. పలు గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో ప్రతి శనివారం విద్యుత్ అధికారులు మరమ్మతులు చేసేవారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నిత్యం మరమ్మతుల పేర విద్యుత్ కోతలు నెలకొన్నాయని ప్రజలు మండిపడుతున్నారు.

**సిబ్బంది కొరతతో సమస్యలు : రణధీర్, పాలకుర్తి ఏఈ**

నిరంతర విద్యుత్‌ను సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నాం. అయితే మాకు స్టాఫ్ కొరత ఉంది. కొత్త ట్రాన్స్‌ఫార్లు ఏర్పాటు చేసినప్పుడు ఎల్‌టీ తీసుకుంటున్నాం. దీంతో కొంతసేపు కరెంట్ సరఫరా నిలపాల్సి వస్తున్నది. పాత ట్రాన్స్‌ఫార్మర్లున్న చోట మరమ్మతులు చేసినప్పుడు కొంత సమయం పడుతున్నది. ఏదైమైనా ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నాం.

## ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

బచ్చన్నపేట, జూన్ 1 : మండల కేంద్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు గ్రామ పంచాయతీల్లో తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించాలని ఎంపీడీవో రఘురామకృష్ణ కోరారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామాల్లో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు కలిసి జా తీయ జెండాలను ఎగురవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు భాగస్వాములు కావాలని ఆయన సూచించారు.




రఘునాథపల్లిలోని ఫర్టిలైజర్ షాపులో విత్తన ప్యాకెట్లను పరిశీలిస్తున్న అధికారులు


## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

రఘునాథపల్లి, ఏప్రిల్ 1: ఫర్టిలైజర్ షాపుల యజమానులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే సహించేది లేదని తహసీల్దార్ యుగంధర్ అన్నారు. టాస్క్ ఫోర్స్ బృందం అధికారులు మండల కేంద్రంలో శనివారం విత్తనాల, ఎరువుల షాపులను తనిఖీ చేశారు. ఆయా షాపుల లైసెన్స్, పత్తి విత్తన ప్యాకెట్లు, స్టాక్ రిజిస్టర్, ఇన్ వాయిస్, బిల్ బుక్స్, రికార్డులను పరిశీలించారు. విత్తనాలను కంపెనీ రేటుకు మించి విక్రయించొద్దని ఆదేశించారు. రైతులకు విడి విత్తనాలు విక్రయించొద్దన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని ఆదేశించారు. వ్యవసాయ అధికారి కాకి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై దూదిమెట్ల నరేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

## ఉప్పుగల్లు వాగులో ఒకరి మృతి

జఫర్‌గఢ్, జూన్ 1 : ప్రమాదవశాత్తు వాగులో పడి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని ఉప్పుగల్లులో జరిగింది. స్థానిక ఎస్సై రవి తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పుగల్లుకు చెందిన సంగి కొమురయ్య(55) శుక్రవారం బంధువుల ఇంటికి వెళ్తున్నాని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. శనివారం ఉదయం వరకూ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ క్రమంలో గ్రామ శివారు లోని వాగులో కొమురయ్య మృతదేహం కనిపించడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు పరిశీలించి బోరున విలపించారు. మృతుడి భార్య సంగి స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవి తెలిపారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న మలోత్ రాజు

చిల్పూరు, జూన్ 1 : స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలోని ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామానికి చెందిన పన్నీరు సారయ్య (59) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్ జిల్లా నాయకుడు మాలోత్ రాజు మృతదేహాన్ని శనివారం సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కటుంబ సభ్యులను పరామర్శి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. సారయ్య కుటుంబానికి అండగా ఉంటామని రాజు హామీ ఇచ్చారు.

## పీజీ సెమిస్టర్ పరీక్షల టైం టేబుల్ విడుదల

హనుమకొండ చౌరస్తా, జూన్ 1 : కేయూ ఎమ్మెస్సీ 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ (కెమిస్ట్రీ) ఆరో సెమిస్టర్ టైం టేబుల్‌ను పరీక్షల నియంత్రణాధికారి నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి బీఎస్ఎల్ సౌజన్య విడుదల చేశారు. జూన్ 7, 10, 12, 14, 18న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతాయన్నారు. ఎనిమిదో సెమిస్టర్ జూన్ 11, 13, 15, 19న ఉదయం 10 నుంచి మధ్యా హ్నం 1 గంటల వరకు జరుగుతాయని, పదో సెమిస్టర్ 7, 10న జరుగుతాయన్నారు. ఎమ్మెస్సీ 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ (బయోటెక్నాలజీ) 8వ సెమిస్టర్ 11, 13, 15, 19న, ఆరో సెమిస్టర్ 7, 10, 12, 18న, ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ రెండో సంవత్సరం సెకండ్ సెమిస్టర్, ఆరో సెమిస్టర్ పరీక్షలు 11, 13, 15, 18, 20, 22 న జరుగుతాయని పేర్కొన్నారు.